


సముద్రాల రామానుజాచార్యులు

**బడిలో** పనిచేసే వాడే కాదు; విశ్రాంతి పొందిన రెండేళ్ళలోనైన క్రమబద్ధంగా కాలాన్ని గడపడంలో మార్పులేదు రామ్మూర్తి పంతులు గారికి.

వాడు, ఉదయాన్నే తన పనులు ముగించుకొని, బడికి వెళ్ళి పిల్లలకు చదువు చెప్పడం, మిగిలిన కాలంలో ఆధ్యాత్మికంగా గడపడం ఆయన కృత్యం. అయితే మార్పల్లా విశ్రాంతి పొందిన తర్వాత, కేవలం ఆధ్యాత్మికత్వం మిగిలింది. ఉదయాన్నే జపం, సంధ్యావందనం పూర్తిచేసి వేంకటేశ్వర సుప్రభాతం, ఆదిత్య హృదయం వంటి స్తోత్రాలు చదువుకోడం, మధ్యాహ్నం పురాణ పఠనం నిత్య విధులు. పురాణం చదివేటప్పుడు భార్య అన్న పూర్ణమ్మ దగ్గర చేరితే ఏమైనా అర్థం చెప్పడం కద్దు.

గంభీరమూ, విశాలమైన ముఖం, నయాగానైన అంత బొట్టూ నిలువెత్తు భారీ మనిషి ఆయన. ఖద్దరు పంచె, కోటు, అకు చెప్పులు, తలపాగా వేసుకొని బడికి వెళ్తుంటే గ్రామంలో ఉన్న పెద్దలకు వివలేని గౌరవం. పిల్లలకు సింహస్వప్నం ఆయనను చూస్తే. కారణం పాగాకే శలవు గాని, పంతులుకు శలవు లేదనే సామెతకు నిదర్శనం ఆయన.

ఉద్యోగంలో ఉండగానే ఇద్దరాడపిల్లలకు పెళ్ళి చేశారు, తనకు తగిన రీతిలో. మగపిల్లలిద్దరూ పెద్ద ఉద్యోగాల్లోనే స్థిరపడ్డారు. ఆఖరి పిల్ల మాత్రం ఇల్లు పట్టేసరికే రిటైరయ్యా రాయన.

పిల్ల లెక్కువ వల్ల యాభై రూపాయలు మాత్రం పంపిస్తున్నాడు పెద్దబ్బాయి. అదీ రిటై రయినప్పటి నుంచీ. చిన్నవాడు విలాసాల వల్ల అతి కష్టం మీదే యాభై రూపాయలు పంపిస్తాడు—అదీ లోకం కోసం అన్న పంపిన నాటినుంచీ. పిల్లల్ని ఇంతివ్వండని అడగడం ఎన్నడూ అలవాటు లే దాయనకు. ఎలాగో కాలం నెట్టుకొస్తున్నాడు.

## 2

పురాణం ముగించి కళ్ళజోడు పెట్టెలో పర్దుతూన్న భర్తకు ఇంటి పరిస్థితి చెప్పక తప్పిందిగాదు అన్నపూర్ణమ్మగారికి.

''ఇంట్లో పరిస్థితి చాలా అధ్వాన్నంగ ఉందండీ! సామాన్లు నిండుకొని వారం రోజు లయింది.'' చెప్పలేక చెప్పలేక అన్నా దా మాటలు.

తనకు తెలియందూ. నెల పదిహేను దినాలయింది సామాన్లు తెచ్చి. ఇప్పటికి ఎవ్వరూ సొమ్ము పంప లేదు. ఎవరినైనా అడగడానికి అభిమానం అడ్డు పడుతూంది తనకు. ఏం చేస్తాం—అన్నట్టు గట్టిగా నిట్టూర్చి ఊరుకున్నా రాయన.

''మవునంగా ఊరుకుంటే ఎలా గండీ! మీరు రిటైరయ్యాక ఏవేవో వస్తాయని చెప్పేవారు. ఆ డబ్బు ఎన్నాళ్ళకు వస్తుందండీ?'' అంది.

తనకు తెలుసా, కాల నిర్ణయం చేయడానికి.

ఎవరు చెప్పగలరు? అన్నట్లు తలపంకించి ఊరు కున్నా రాయన.

"పోనీ మీ దక్కడకు వెళ్ళి ప్రయత్నించరా దండీ!"

అలాంటి పనులు తనకు తెలియవు. ఎదురు చూడ్డమే గాని, ఎదిరించడం చేతగాదు.

"ఆ డబ్బువస్తే పిల్ల తలపై అక్షింతలు వేద్దాం అనేవారు. అది ఇల్లుపట్టి రెండేళ్ళయింది. కాలం గడిచిపోతుంది. దాని పెళ్ళి మాట అలా ఉంచండి. కాలక్షేపం కష్టమవుతూందండి. ఏం చెయ్యాలో తోచటం లేదు." జీరబోయిన కంఠంతో అన్న పూర్ణమ్మ అంది.

సహనానికి ప్రతీక అయిన అన్నపూర్ణ ఎదురుగా ఏ విషయం చర్చించడం ఎరగ డాయన. తనను పూర్తిగ అర్థం చేసుకున్న వ్యక్తి ఆమె. ఏమైనా తన బాధ్యత నిర్వర్తించాలి. తప్పదు. ఏం చేయాలి?

ఏదో ఆలోచించుకొని ఒక నిర్ణయానికి వస్తూ, "ఆ కోటు, వాణీ ఇవ్వు. అలా వెళ్ళొస్తా" అన్నారు. ఆయననుపంపి తలుపుకు చేరబడింది అన్నపూర్ణమ్మ.

ఆయనమాత్రం ఏం చేస్తారు. అసలే ఆత్మాభి మాని. దానిపై వార్ధక్యం. దాని మీద డిప్పెరు మెంటు. అన్నీ అతన్ని కుంగదీశాయి. ఆలో చనలలో తెలియకుండానే కన్నీళ్ళు కారిపోతున్నా యామెకు. నిరాశా నిస్పృహలలో గ్రహణం పట్టిన ట్లుందామె మనస్సుకు. మాస్టారి రాక ఆమెకు తెలియనే లేదు. ఎంతసేపుందో ఆమె అలా!

'మర్నాటి ప్రయాణానికి సిద్ధం చేయ'మని చెప్పి చతికిల బడ్డారు వాకిట్లో.

## 3

భోజనంచేసి ఫైలు చేతో పట్టుకొని హుందాగా సిగరెట్టు కాలుస్తూ కొలీగ్‌తో వస్తూన్న రామా రావుకు దూరంనుంచీ సందేహం కలిగింది—ఆ కోటు, ఆ నడక, ఆ చేతులూపడం తనకు బాగా తెలుసు. ఆయన తన మాస్టారే. సందేహం లేదు. ఎందు కయినా మంచిదని సిగరెట్టు పారేసి త్వరగా నడిచి ఎదురుగా వెళ్ళా డాయనకు. సమీపించిన కొద్దీ తన నమ్మకం దృఢ మయింది. "మాస్టారూ! నేను మాస్టారూ రామారావుని గుర్తు పట్టారా" అంటూ చేతులు రెండూ జోడించి నమస్కారంతో ఆపా డాయనను.

ఆయనను చూసిన దగ్గర్నుంచీ ఉద్వేగం, వినయం, భక్తి, అనురాగం ముప్పిరి గొన్నాయి అతనిలో.

"ఎవరూ... రామూ! బాగున్నావోయ్?" అన్నా రాయాస పడుతూ.

"ముందు ఇంటికి రండి మాస్టారూ, చెబుతా" అంటూ చుట్టూ కలియజూసి ఆటోరిక్షా పిలిచేడు.

తన కొలీగ్ సుబ్బారావుకు మాస్టార్ని పరిచయం చేసి తెల్లకాగితంపై సంతకం పెట్టి శలవు చీటీ ఇమ్మన్నా డాఫీసుకు. సుబ్బారావు ముందుకు సాగి పోయాడు.

"ఎందుకోయ్ నడిచిపోలేమా" అన్నారు.

"మీ రుండండి, మాస్టారూ" అంటూ చేతి ఊతతో ఆయనను ఎక్కించాడు. ఒదిగి పక్కగా కూర్చున్నాడు. ఆటో కదిలింది.

"సంచీ ఇలా ఇవ్వండి, నేను పట్టుకుంటాను" అన్నాడు.

"ఎందుకు లేవోయ్" అంటూ తన కుడిప్రక్క సర్దుకున్నారు కానరానీయకుండా.


మాస్టా రెంతగా మారిపోయారు అనుకున్నాడు మనస్సులో.

మాసిన పంచె, ముడతలు దేరిన శరీరం. మాసిక లతో ఉన్న కోటు, దీనంగా ఉన్న ముఖం. తలంతా పండి చిన్న వెంట్రుకలతో పిలక — ఆయన దీనా వస్థను బుజువు చేస్తున్నాయి. చేతనున్న గొడుగు ఏ నాటిదో నిర్దుష్టమైన రంగే లే దా గొడుగుకు. కనీసం చెప్పులన్నా లేవు పాదాలకు.

మవునంగా ఉన్న మాస్టారిని మాట్లాడించా లంటే భయం ఇంకా పోవడం లేదు తనకో.

"అమ్మగారు బాగున్నారా, మాస్టారూ పిల్లలు! బాగున్నారా?"

"ఆ కులాసాగా ఉన్నారోయ్. నీకు పెళ్ళయిందా! పిల్లలా?" అన్నారు.




"పెళ్ళయిందండీ. ఇద్దరు పిల్లలు కూడా."

"సంతోషమోయ్. ఇక్కడేం చేస్తున్నావ్?" చెప్పాడు.

"మీ రెక్కడ నుంచి వస్తున్నారు, మాస్టారూ?"

"ఇంటి నుంచి."

"ఆ స్తంభం వద్ద ఆపవోయ్" అని ఆటోవాడికి చెప్పి—"దిగండి, మాస్టారూ. అదే...ఆ కనిపించే ఇల్లే మేమున్నది" అని ఆటో వాడికి చార్జి చెల్లించి చకచకా అడుగులేస్తూ వెళ్ళి తలుపు తట్టాడు.

తలుపు తీసి భర్తను చూసి నివ్వెరపోయింది శైలజ.

"మా మాస్టా రొచ్చారు. ఆఫీసుకు సెలవు పెట్టా. వెళ్ళి కావలసినవి ఏర్పాటు చేయి" అన్నాడు భార్యతో.

"అలాగే" అంటూ లోనికి వెళ్ళిం దామె.

"రండి, మాస్టారు, లోనికి" అంటూ తనగదిలోకి నేరుగా తీసుకు వెళ్ళాడు.

గది, వరండా, వేరుగా వంటిల్లు. ప్రక్క బాత్ రూం. ఇంటికి కావలసిన హంగులన్నీ ఉన్నాయి. చుట్టూ కలియజూసి సంచీలో ఉన్న పాత చెప్పులను వరండాలో మూలగా పడవేసి మళ్ళీ లోనికి వచ్చారు మాస్టారు.

"ట్రయిను దిగి నాలు గడుగులు వేశానో లేదో చెప్పులు తెగిపోయాయోయ్. ఎక్కడ బాగుచేయించాలో తెలియదు. అందుకనీ ..." సిగ్గుపడిపోయా రాయన.

"పోనీలెండి, మాస్టారూ, నేను మధ్యాహ్నం బాగు చేయిస్తాగా" అన్నాడు వినయంగా.

ఇల్లు చిన్నదైనా అందంగా ఉంది. చుట్టూ ఉన్న వస్తువులు చూస్తే రామారావు స్థితి బాగున్నట్లు తృప్తిపడ్డాడు. మంచానికి ఎదురుగా ఉన్న తన ఫోటో చూసి గట్టిగా ఊపిరి తీసి విడిచారు. కోటుతీసి చొక్కా కూడా ఊడదీశారు త్వరత్వరగా. కోటు కొయ్యకు పెట్టి చొక్కా సంచీలో పెట్టారు.

వాకిట్లో గుమ్మం దగ్గిర నిలబడి చూశారు రామారావు. ఆ చొక్కాకు ఎన్ని మాసికలో. ఇంకా అన్ని చిరుగులు ఉన్నాయి. రామారావు గుండె కరిగి పోయింది, మాస్టారు స్థితికి. ఆయన ఆ చొక్కా సంచీలో ఎందుకు పెట్టారో బోధపడింది.

"రండి, మాస్టారు! స్నానం చేద్దురు గాని." తువ్వాలు అందించాడు రామారావు. "పద" అంటూ అతనివెంట నడిచారు.

వేడినీళ్ళ స్నానంతో ఒళ్ళు తేలికయిం దాయనకు. బొట్టు ముఖాన్న పెట్టుకొని పీటమీద కూర్చుంటూ ఆమెను చూస్తూ—"ఇన్ని వస్తువు లెప్పుడు చేశా వమ్మా!" అన్నారు ప్రేమగా.


మీకోసం చేయలేదండి. అన్నం మాత్రం వండాను. పన్నెండయ్యాక భోంచేయడం నా కలవాటు. బడిలోనుంచి పిల్లడు వస్తే వాడికి పెట్టి తింటాను. మీరు భోంచెయ్యండి" అంది నెయ్యి వడ్డిస్తూ. "అలసి అలసి ఉన్నారు తాపీగా తినండి." ఎంతో సహజంగా ఉన్నాయి ఆమె మాటలు. ఆమె చూపే

ఆదరణకు ముగ్ధులయ్యారు. రామారావు అదృష్ట వంతుడే అనుకున్నారు మనస్సులో.

కొసరి కొసరి వడ్డిస్తూ మధ్యలో తమ స్థితిని, ఉద్యోగాన్ని ఆమె చెబుతూ ఉంటే తృప్తిగా భోం చేశారు. 'ఆవకాయ ఎంతో బావుంది. ఎన్నాళ్ళయిందో ఇన్ని వస్తువులతో తిని' అనుకుంటూ 'కాలు తిమ్మిరి పట్టింది' అని లేవలేకపోయారు. చేతి ఊత ఇచ్చి ఆయనను పట్టుకొని మెల్లగా నడిపించి తీసుకు వచ్చిందామె. వరండాలో ఉన్న రామారావు "ఏమైంది ?!" అని అన్నాడు.

"ఏం లేదండీ, కాలు తిమ్మిరి పట్టింది" అందామె.

"మరేం లేదోయ్" అన్నారు మాస్టారు. శైలజ లోనికి వెళ్ళింది. ఆయనను నడిపిస్తూ పడక గదిలోకి తీసుకుపోయాడు రామారావు.




"మీరు విశ్రాంతి తీసుకోండి, మాస్టారూ, తర్వాత మాట్లాడదాం. నే నిక్కడే ఉంటా" అన్నాడు రామారావు—కిళ్ళీ చేతిలో పెట్టి.

"వరండాలో పడుకుంటానోయ్" అన్నారు మొగమాటంగా.

"వీడు మీ శిష్యుడు, మాస్టారూ! నా దగ్గర సంకోచ మేమిటి, మాస్టారూ, మీకు. పడుకోండి" అన్నాడు రామారావు, తలుపు లాగి అవతలకు వెళ్తూ.

మెత్తని పక్కపై మాస్టారు మేను వాల్చారు. రామం చేసిన ఆదరణ, చూపిన అభిమానం అన్నపూర్ణకు చెప్పాలి. ఏనాడో చెప్పిన చదువుకు ఎంత ఆదరణ, ఎంత కృతజ్ఞత. కనుకొలకుల్లో కన్నీరు నిండి ధారగా వచ్చి తలగడపై పడ్డాయి. మెల్లగా ఒత్తిగిలి నిద్రలోకి జారారు మాస్టారు.

వరండాలో వాలు కుర్చీలో వాలి కన్నులు మూసు కొని ఆలోచనలో పడ్డాడు రామారావు.

మాస్టారు ఏ పనిమీద వచ్చారో, ఆయన పనికి సాయపడాలి. ఆయనకు శ్రమ కలగ నివ్వకూడదు. గుమ్మం దిగి ఎక్కడకూ వెళ్ళని మాస్టారు రావ డానికి అనివార్య కారణం ఏదో ఉంటుంది. లేచాక అడగాలి అనుకుంటూ ఉండగా, గతం సుడిలాగ కళ్ళల్లో మెదలాడింది.

## 4

అవి తాను ఎనిమిదో తరగతి చదువుకొనే రోజులు. కేరేజీ చేత్తో పట్టుకొని స్కూల్లో కాలుపెట్టి ప్రక్కనే క్లాసులో ఉన్న తనను పిలిచారు మాస్టారు.

'వచ్చా, మాస్టారూ' అంటూ అను పరుగెత్తి వెళ్ళా డాయన దగ్గరికి.

"ఈ కేరేజీ తీసికెళ్ళి టీచర్సు రూములో ప్రక్కగా పెట్టు. మజ్జిగ తొణుకుతుంది జాగర్త. చేతలు కడుక్కో." అంటూ ఆయన చెప్తూండగానే ముందుకు వెళ్ళిపోయాడు తను. సంతకం పెట్ట డానికి వెళ్ళిపోయా రాయన. ఇంకా మాస్టర్లు ఎవరూ రాలేదు. వచ్చినవారు ఆఫీసు రూములోనే ఉన్నారు.

కేరేజీ గదిలో పెట్టి వచ్చేద్దామనుకుంటే గమ్మున వాసన వేస్తోంది. చేతికి ఆవకాయ వాసన వదల్లేదు. ఆవకాయ ఎంత బాగుంటుందో— అనుకుంటూ మళ్ళీ వాసన చూసు న్నాడు అబ్బ! విడవ బుద్ధికాలేటు. ఒక్క ఆవకాయ. ముక్క తీసుకుంటే.

అమ్మో—మాస్టారుకు ఎంత ఆచారం. తెలిస్తే చంపేయరూ. ఎవరున్నా రిక్కడ. ఎలా తెలుస్తుం దాయనకు. ఎవరెవరో వస్తుంటా రిక్కడకు. ఎవరు తిన్నారో. తను తిన్నా నమ్మలే రాయన. ఇంతకీ ఒక్క ముక్క—అనుకుంటూ కరేజి కప్పు తెరిచాడు తను. ఒక్క ముక్క ఉంది అందులో. మజ్జిగ అన్నం క్రింద కప్పులో ఉంది. అంతే.

ఆవకాయ ముక్క తీసికొని కేరేజీ మూసేసి మెల్లగా పారిపోయాడు. గ్రౌండు ఆవలకు పోయి చెట్టు క్రిందగబగబ తినేశాడు. ఇంతలో బెల్లయింది. 'మాస్టారు వచ్చేస్తారు' అనుకుంటూ పరుగెత్తి, త్రాగే నీళ్ళకుండీలో నీళ్ళు తీసి చేయి కడుక్కొని చొక్కాకు తుడుచుకున్నాడు చేతిని. చొక్కా అల్లా వాసనే. ఇటూ అటూ పరుగెత్తాడు. వాసన ఎక్కువవుతూంది. తప్పు చేశాను. ఎలాగో ఈ గండం తప్పితే చాలు—అనుకొని చేతులు రెండూ కట్టుకొని చొక్కా బొడ్డులోకి దోపి క్లాసులో మూలగా నక్కి కూర్చున్నాడు.

మాస్టారు వచ్చి పాటం మొదలెట్టారు. ప్రతి ఒక్కడినీ ప్రశ్న వేయడం మొదలెట్టారు. నోరొకటే మండిపోతూంది. పెదిమల వార మరీ మంట. మాస్టారికి తెలిసిపోతుందన్న భయంలో మహ ఓరుస్తున్నాడు.

పాటం చెపుతుంటే మధ్యలో ప్రక్కనున్న మల్లిగాడు నా ప్రక్క చూసి 'ఆవకాయ వాసన నీ దగ్గరే' అన్నాడు. వాడిమీద భలే కోపమొచ్చింది. చీకిన తాటిపండులా జిడ్డోడుతూ వీడూ—ఊరుకో లేడు. వీడి కెందుకు వాసన బాధ? కాకి వెధవ. మహకానివాడు వీడు—అనుకొని 'నువ్వే తిన్నావు. నీ దగ్గరే కంపు' అన్నాడు తను దబాయించి. ఇద్దరూ గొణుక్కుంటూ ఉంటే ఒక ప్రశ్న మాపై పడేశారు మాస్టారు. మల్లిగాడికి అర్థం కాలేదు.

"పాటంలో మాటలు ఎందుకురా, వినరాదూ?" అంటూ వాడిని పిలిచి రెండు పడేశారు. వాడికి పడిన దెబ్బలు నాకు తృప్తి నిచ్చాయి. కానీ, నిజం తెలిస్తే—ఊహించలేకపోయాడు తను.

పుస్తకంలో లీనమైపోయాడు తను. పాటం ఎక్కడడిగినా చెప్పేటట్టు వింటున్నాడు. బెల్లయింది. మాస్టారు వెళ్ళిపోయారు.

గండం గట్టెక్కింది. మరి భయం లేదు— అనుకున్నాడు. మరచి పోదామన్నా మరపు రాక భయంవల్ల మిగతా పీరియడ్‌లలో పనాగ్గానే ఉన్నాడు తను.

లాంగు బెల్లయింది. ఎవరిమట్టుకు వారు ఇళ్ళకు వెళ్ళిపోయారు. తాను మాత్రం మెల్లగా కదిలాడు. గోడప్రక్కనుంచి తొంగి చూశాడు. మాస్టారు అన్నం తింటున్నారు—కళ్ళు మూసుకొని కష్టంగా.

కన్నీళ్ళు కారిపోయాయి తనకు. ఎంత తప్పు చేశాను! నంచు పందికి లేక మధ్యలో నీళ్ళు తాగుతూ గుటక మింగుతున్నారు మాస్టారు. ఎంత తప్పు చేశాను! ఇప్పుడు కళ్ళపడ్డానా...చంపేస్తారు. అందరికీ తెలిస్తే ఎంత నవ్వుతారో!

ఎవ్వరికీ కనిపించకుండా క్లాసులోకి పోయి కూర్చున్నాడు తను. తల నొప్పిగా ఉంది. జ్వరం వచ్చేటట్టు వేడిగా ఉంది జ్వరం వచ్చినా బాగుండును. మాస్టారు మరిచిపోయేటంతవరకు.

మధ్యాహ్నం క్లాసులు ప్రారంభమయినాయి. ఈమధ్యలో మాస్టారు ఎప్పుడు పిలుస్తారోనన్న భయం క్షణం క్షణం లావైంది. కాని, పిలవలేదు. ఆడవాళ్ళు మరిచిపోయారనుకొని ఉంటారు. తన కేమి? సమాధాన పరచుకుంటున్నాడు మనసును. ఇలా గంట అయేవరకు ఏదో ఆలోచించి గంట అయిన వెంటనే పారిపోయాడు. ఎక్కడికి పోవాలి కనక తను? సత్రంలో తిండి. అక్కడే ఉనికి తనకు. తనలాగే పదిమంది వరకూ అక్కడే ఉంటారు. తన కెవ్వరూ లేరు.

మర్నాడు మాసిపోయిన మలో చొక్కా తొడుక్కొని నిబ్బరంగా క్లాసుకు వెళ్ళాడు. మాస్టారు రావడం తను చూశాడు. పిలిస్తే బాగుండు ననుకున్నాడు. మరి తప్పు చేయడు. ఆయనకు తనపై నమ్మకం ఉంటే చాలు.

మాస్టారు తిన్నగా వెళ్ళిపోయారు. లోన కేరేజీ పెట్టుకొని ఆఫీసు రూమ్‌లో నీళ్ళతో చెయి కడుక్కొని లోపికి వెళ్ళిపోయారు. తనను పిలవ లేదు. ఎంతో కష్టమనిపించింది. తాను లేనను కున్నారేమో! టీచర్ను గంటయింది. క్లాసులోకి వచ్చారు మాస్టారు. ఆయనను చూస్తే కంపర మొస్తుంది. కనీ కనపడనట్లు కూర్చున్నాడు తాను. పీరియడ్ అయేవరకు పాఠం చెప్పారు. ప్రశ్నలు వేశారు. తననూ ప్రశ్న వేశారు. తప్పులు చెప్పినా దిద్దారు. కాని, ఏమీ అనలేదు. ఏదో మిషతో తనను గట్టిగా కొట్టకూడదూ!—అను కున్నాడు మనసులో.

మొదటి పీరియడు అయింది. మాస్టారు లేచి వెళ్ళిపోతూ గుమ్మం వరకూ వెళ్ళి—"రామం! నువ్వు లాంగ్ బెల్లయ్యాక నా దగ్గరకు రారా" అని ఆదేశించారు దృఢ స్వరంతో.

చెమట క్రమ్మింది తనకి. ఇవాళ చావు తప్పదు.

చివరి గంట అయింది. గుండెపై సుత్తి దెబ్బలు తగిలినట్లయింది. పులికి ఎదురు పోవాలి. ఇవాళ...ఇవాళ...అనుకుంటూ గది దగ్గరకు వెళ్ళి దేవుడికి దండం పెట్టాడు మనస్సులో.

దేవుడంటే తన దృష్టిలో మాస్టారే.

ఇవాళ అంతులేని భయం.


"వచ్చావా, రామం! రా, ఇలా దగ్గరగా రా. చేతులు కడుక్కొని రా" అన్నాడు.

గబగబా బాదెయ్యకూడదూ. కొట్టడానికి చేతులు కడుక్కోవాలా? చెయ్యి కడుక్కొని వచ్చి నిం బడ్డాడు భయంగా.

ఈలోగా ఒక కప్పునిండా పెరుగు అన్నం పెట్టారు. పెద్ద అవకాయ ముక్క, పిండివేసి ఉంచారు. కొంచెం అన్నం, నీళ్ళ పెరుగు, కొంచెం నీళ్ళు వేసుకొని—"వచ్చావా, రా. రామూ! తినరా. తప్పులేదు. నీకు నోరు బాగా లేకపోతే నాతో చెప్పరాదూ. అమ్మగారిని అడగరాదూ. దొంగ తనంగా తినే ఖర్మ నీకేమిరా! నేనేమైనా అంటానా నిన్ను. నువ్వు ఎంతో మంచివాడివి. నువ్వంటే ఎంతోఅభిమానం నాకు. తెలియక చేసావు ఇంకెప్పుడూ చేయకూ. రా, తిను" అంటూ ఆయన తినడం ప్రారంభించారు.

తన ముఖం ఎర్రగా అయిపోయింది. కన్నీళ్ళు ఆగడం లేదు. మాస్టారు ఎంత మంచివారో. ఆయన వద్ద ఎంత తప్పు చేశాడు. క్రిందకు చూస్తూ కొయ్యబొమ్మలా అయిపోయాడు. మాస్టారు తినడం పూర్తిచేసి—"రారా!" అన్నారు మళ్ళీ. చేయి కడుక్కొని వచ్చా రాయన. గిన్నె, అన్నం, పెరుగు, ఆవకాయ— తనకోసం ఎదురుచూస్తున్నాయి. మాస్టారి పాదాలపై పడిపోయాడు తను.

"నామీద కోపం వచ్చిందా మాస్టారూ. నన్ను కొట్టండి మాస్టారూ. చంపేయండి! మాస్టారూ, నేను దుర్మార్గుణ్ణి, పాపిష్టివాడిని. చేయరాని తప్పు చేశాను, మాస్టారూ! ఎన్నడూ మరి చేయను. మాస్టారూ!" ఇలా కన్నీళ్ళతో కాళ్ళు కడిగేశాడు. చేతులతో పాదాలు పిక్కలు పెనవేసుకున్నాడు. తల మాస్టారి పాదాలమీద వేసి ఏడుస్తున్నాడు.




చేతులు రెండు పాదాలపై ఉంచి నేలకేసి తల బాదుకుంటున్నాడు.

"పిచ్చివాడు. వాడిమీద నా కోపమేమిటి?" అని మనసులో అనుకుంటూ వాడిని లేవనెత్తారు.

"రామం—రామం—ఏమిట్రా ఈ పిచ్చి! పిచ్చి వాడా, నీవేం చేశావురా! ఏమీ అవలేదురా! సత్రంలో తింటున్న నీ కష్ట సుఖాలు చూడకుండా వూరు కుంటున్న తప్పు నాదిరా! లే—లెయ్" అంటూ లేపి కళ్ళు తుడిచి జుట్టు వెనక్కి నెట్టేరు బుగ్గలు పట్టుకొని—

"నిన్నేమీ అనను రా! నువ్వేమైనా, నా కొడుకైనా వా కొకటేరా, లే" అంటూ కన్నీళ్ళు తుడుచుకున్నారు.

మాస్టారి అభిమానం, ఆదరణ, కరుణ తనను కదిలించి కరిగించాయి. అన్నం తినక తప్పలేదు. అన్నం మూడు ముద్దల్లో తిని, పాత్రలను కడిగి మూల పెట్టాడు.

"రామం! రాత్రినుంచీ నువ్వు ఎప్పుడు కావాలనుకున్నా ఇంట్లో తిను. మీ అమ్మగారితో చెప్పానులే. మాలో నీవు ఒకడివి. బాధ పడకు" అన్నారు.

నాటినుంచీ తల్లీ, తండ్రీ, గురువు, దైవం మాస్టారే. ఆ ఊరిలో చదువు పూర్తయ్యేవరకు మాస్టారి పర్యవేక్షణయే తనకు. మంచి మార్కులతో పాసయిన తనను ఎంతో మెచ్చుకొని కాలేజీలో పెట్టారు. అందరి ఉపాధ్యాయులచేత చందా లిప్పించారు. కాలేజీలో చేర్చి వారాలు కుదిర్చారు. వారాలు చేసుకొని చదివి ఇంతవాడయ్యాడు మాస్టారి దయవల్ల. ఎప్పు డేది కావాలన్నా వారే కనిపెట్టి చూశారు. అలాంటి మాస్టారు ఇవాళ...

కన్నీళ్ళు కారిపోతూంటే తలంతా భార మయింది. శైలజ వచ్చి ఎంతసేపయిందో తనకు తెలియదు.

"ఏమండీ! ఏమి టా ఆలోచన. ఆ కన్నీరేమిటి? ఎందుకలా అయిపోతున్నారు? నాతో చెప్పరాదండీ! మాస్టార్ని చూసి బాధపడుతున్నారా? ఆయన పనేమిటో అడగండి. శక్తివంచన లేకుండా చేసి ఆయనను సంతోషంగా పంపిద్దాం" అంది ఆమె.

మాస్టారి విషయం తా నామెకు ఎన్నోసార్లు చెప్పాడు. ఆమెక్కూడా మాస్టారిపై అంతులేని గౌరవం.

"లేదు, శైలా, మాస్టారుగారి పనిచేసి తీరాలి. లేవనీ అన్నీ అడుగుతా" అన్నాడు.

## 5

గొంతు విని లోనికి వెళ్ళి "మాస్టారూ! ముఖం కడుక్కుందురు గాని రండి" అని పిల్చి తీసు కెళ్ళాడు. మాస్టారు లేచి ముఖం కడుక్కున్నారు. ఒప్పిన పని ఏమీ చేయలేదు. హాయిగా నిద్ర

బాధారహిత ప్రకృతిసిద్ధమైన ఆరోగ్యము మీదే!
స్త్రీల బాధలు ప్రత్యేకమైనవి
లోధ్ర
75 సంవత్సరములకు పైగా
సుఖజీవనమునకు
లోధ్ర టానిక్‌ను
వాడిన స్త్రీలు ఎందరో!
ఉచిత వైద్య సలహాకు
ఈ క్రింద పేర్కొనబడిన విలాసమునకు
ఈ కూపన్‌ను పూర్తిచేసి మీ జాబుతో పంపండి.
పేరు:
విలాసము:
PIN


కేసరి కుటీరం (ప్రైవేట్) లిమిటెడ్
రాయపేట, మద్రాసు-14
ఏజంట్లు: సీతారామ జనరల్ స్టోర్స్ ఏజన్సీస్ విజయవాడ — సికింద్రాబాద్

లండన్ మెడికల్ రికార్డ్—"ఇవ్వడిది సరిగ్గా దాని కలయికలో చెవ్వకో దగ్గ విధంగా మిక్కిలి ఉన్నతమైనదిగాను త్వరితంగా పనిచేసేలా పేరు గడించింది. నీరసమైన కడుపుగల వారు నమ్మదగ్గదిగా అత్యంతంగా పనిచేసి చేయూత నిస్తుంది.


క్షణాల్లో మాయం
చేస్తుంది ఎటువంటి
అజీర్ణమునైనా సరే

ఓపియమ్‌తో కలసిన
హూలెట్స్ మిక్స్చర్
కూడా లభిస్తుంది.
అజీర్తికి త్వరితమైన
ఉపశమనము.
హ్యూలెట్స్
మిక్స్చర్

పోయాను. రేవు వెళ్ళిపోవాలి. ఎక్కడికి వెళ్ళాలో, ఎవరిని కలవాలో" మనస్సులో తలంపు వచ్చేసరికి ఆలోచనలతో భారమయింది ఆ మాస్టారికి.

"ఇలా కూర్చోండి మాస్టారూ, టిఫిన్ తినండి. మీరేం ఆలోచించవద్దు. మీ పని ఏదైనా సరే చేసిపెడతా, తినండి" అన్నాడు.

బలవంతంపై తినక తప్పలేదు. కొంచెం తిని "మరి వద్దోయ్. నా ఆరోగ్యం అంత సరైంది కాదు" అన్నా రాయన.

ఇంతలో కాఫీ తెచ్చింది శైలజ. కాఫీ త్రాగుతూ సంభాషణలో పడ్డారు.

"నేను రిటైరయి రెండేళ్ళు దాటుతున్నాయోయ్. నేటికి గ్రాట్యుటీ, పెన్షను, ప్రావిడెంటు ఫండు రాలేదు. ఆఖరి పిల్ల పెళ్ళికుంది. పెళ్ళి మాట ఎలాగున్నా కాలక్షేపానికి..." మరి చెప్పలేక పోయారు. పొలబారిం దాయనకు. ఆత్మాభిమానంతో తనప్రక్కకు తిప్పుకొని ఏమీ అనలేక—

"సర్వీసులో ఉండగా భగవంతుడు తీసుకు పోయినా బాగుండేది. ఇంటి పరిస్థితి కష్టంగా ఉందోయ్" అన్నారు.

త్రుళ్ళిపడ్డాడు రామారావు. ఆయనకు తెలియకుండాసర్దుకుంటూ—"మీరే ఊళ్లోరిటైరయ్యారండీ" అని అడిగాడు.

"రామాపురంలోనే నయ్యా!"

"ఎన్నాళ్ళయింది కాగితాలన్నీ పంపించి ?" మనస్సులో ఏదో ఆలోచించుకుంటూ అడిగాడు రామారావు.

"రిటైరైన నాలుగైదు నెలల్లోనే పంపామోయ్. హెడ్మాస్టరుగారికి నేనంటే అభిమానమే. చాలా మంచివారు. ఆయన నేడో, రేపో రిటైరయ్యే సమయమే" అన్నారు.

కాస్త సర్దుకొని—"ఈ విషయంలో మీరేం గాబరా పడవద్దండీ, మాస్టారూ! పదిరోజులలో మీ పని చేయించగలను. మీరు నాకు ఉత్తరం రాసినా చేయించేవాడినిగదా" అన్నాడు రామారావు.

"నువ్వు ఇక్కడ ఉన్నావని నాకు తెలియదోయ్. ఎవరి వద్దకు వెళ్ళాలో, ఏం చెయ్యాలో నాకు తెలియదు. మీ అమ్మగారు పడే వేదన, ఇంటి పరిస్థితి చూడలేక బయల్దేరా."

"సర్లెండి. మా ఇంటికి మీరు వచ్చే అదృష్టం కలిగింది. ఈ చిన్న పని నేను అతి త్వరలో చేయిస్తా. ఏ రేం దిగులుపడకండి" అని "మాస్టారూ! బజారువైపు అలా వెళదాం రండీ" అన్నాడు వినయంగా, భక్తితో.

"నే నెందుకోయ్. మీరు వెళ్ళిరండి. నేను ఇక్కడ్లో ఉంటా" అన్నారు ఆయన.

"అలా కాదండీ. మీరూ రావాలి" అంటూ నిర్బంధం చేశా డాయనను. బయల్దేరక తప్పింది గాదాయనకు.

"శైలా! నువ్వు, పిల్లలు కూడా రండి. అంతా అలా వెళ్ళివద్దాం" అంటూ భార్యతో చెప్పి తను ముఖం కడుక్కోడానికి లేచాడు. మాస్టారు పాత చొక్కా,కోటు వేసుకున్నారు. ఖద్దరు పంచె కట్టుకొని కండువా వేసుకొన్నారు.

తనూ, భార్యా, పిల్లలూ బయల్దేరారు. "పదండి

మాష్టారూ" అంటూ వాకిట్లోకి వెళ్ళి ఆటో మాట్లాడాడు.

## 6

బజారునుంచి తిరిగి వచ్చేసరికి ఏడయింది. మాష్టారికి పంచెలచాపు, చొక్కాగుడ్డ, వాణీ, అమ్మగారికి చీర, జాకెట్లు, పిల్లకు పరికిణీ, వాణీ జాకెట్లు, మాష్టారికి చెప్పులు అన్నీ కొన్నాడు. తన బేగు ఒకటి తీసి దానిలో సర్దాడు అవన్నీ.

వాలు కుర్చీలో కూర్చుని ఏవో ఆలోచిస్తూన్న మాష్టారి ముఖంలో దైన్యం కొట్టవచ్చినట్లుంది. దీనంగా ఉన్నారు. తన పని ఏమీ కాలేదు—అదీ ఆయన విచారం. మెల్లగా వారివద్దకు చేరి కాళ్ళవద్ద కూర్చుని—"మీరు వారం రోజులలోగా మీ కాగితాలు వచ్చేటట్లు చేస్తా, మాష్టారూ! దిగులు పడకండి. నా పూచీకద. మీరు నిశ్చింతగా ఉండండి" అన్నాడు. ఈ మాటలు ఆయనకు తృప్తినిచ్చాయి.

రాత్రి భోజనాల వేళ చాలా ఆనందంగ ఉన్నారు మాష్టారు. రామం కనిపించకపోతే ఏమయ్యేవాడో. భగవంతు డెంత కరుణామయుడు. మనస్సులోనే నమస్కరించారు దైవాన్ని.

మరో రెండు రోజులుండమని కోరారు దంపతు లిద్దరూ. కాని ఇంటి పరిస్థితి బాగులేదని మర్నాడు ప్రయాణానికి సిద్ధం చేయమన్నారు మాష్టారు. తనను స్టేషనుకు దిగబెడితే చాలు.

రాత్రి వెళ్ళి టికెట్ రిజర్వేషను చేయించాడు రామారావు. మాష్టారితో చెప్పకుండానే తాను తెచ్చిన సామానంతా సర్ది భార్యతో, పిల్లలతో మర్నాడు స్టేషనుకు వెళ్ళాడు మాష్టారితో.

టికెట్ తీసుకోడానికి జనసమ్మర్దంలోకి వెళ్ళే మాష్టారుని ఆపి—"నే తెచ్చా, మాష్టారూ, మీరు రండి" అని చేయి పట్టుకొని రిజర్వేషను చేసిన కంపార్టుమెంటుకు తీసుకుపోయాడు. లోపల కూర్చోబెట్టాడు. సామాను సర్దింది శైలజ.

ఒక్కొక్క రూపాయి చేతిలో పెట్టారు మాష్టారు పిల్లలిద్దరికీ. "మాష్టారూ! మీరు ఇలా చేస్తే..." వారించాడు రామారావు. క్రిందికి దిగి మందహాసం చేసి ఊరుకున్నారాయన.

పది నిమిషాలలో బండి బయల్దేరుతుందని ఎనౌన్సరు చెప్పాడు. మాష్టారికి ఆత్రత ఎక్కువయింది.


"రామం! చిన్నమాట" అన్నారు లోనికి పిలుస్తూ.

"ఏమిటి, మాష్టారూ, చెప్పండి" అన్నాడు రామారావు లోనికి వెళ్ళి.

"ఆఫీసులో ఖర్చులుంటాయి. ఈ డబ్బు నీ దగ్గరుంచుకో. త్వరలో నా పని అయ్యేలా చెయ్యి. నా పరిస్థితి నీకు తెలుసు గదూ!" అన్నారు కన్నీళ్ళు దాచుకుంటూ.

"మీ పని చేయందే అన్నం తినను—నిద్రబోను. నా మాట నమ్మండి. నా పిల్లలపై ప్రమాణం" అన్నాడు ఆయన చేతులు పట్టుకొని.

"రామం! నీ అభిమానం నాకు తెలుసు. నీకు తగిన భార్య, చక్కని పిల్లలు, ఉద్యోగం అన్నీ లభించాయి. భగవంతుడు నిన్ను చల్లగా చూస్తాడు" అని చేత్తో తల నిమిరాడు రామాన్ని.



ఫోటో — వినయ్. ఎస్. జి.

గంట మ్రోగింది. "నీవు వెళ్ళు, రామం! అమ్మా, శైలజా! నీ అభిమానం మరువలేనమ్మా. మీ యోగక్షేమాలు ఉత్తరం వ్రాయించు" అన్నారు కిటికీ వైపు తిరిగి.

"టిఫిను చేసి వేరే ఉంచా. రాత్రి బండిలో తినండి మాష్టారూ" అంది శైలజ. రామం, శైలజ క్రింద నిలబడి కన్నీళ్ళతో మునిగిపోయారు.

## 7

బండిలో కూర్చున్న మాష్టారి మనస్సులో ఒకటే ఆలోచన—రామం మంచివాడు. చాలా ఆదరించాడు. కానీ ఈ డబ్బు ఖర్చుపెట్టే బదులు చేతికిస్తే రెండు నెలలు గడిచేవి. తన నోటితో ఏమని చెప్పగలడు. పోనీ తన పనైనా పూర్తిచేసి పంపితే అదే పది వేలు. తనైతే స్వయంగా ఏమీ చేయలేడు. భగవంతుకీ విధంగా సాయపడ్డాడు—అనుకున్నారు మాష్టారు.

ఇంటికి చేరిన తర్వాత అక్కడ జరిగిన విషయాలన్నీ పూస గ్రుచ్చినట్లు చెప్పారు అన్నపూర్ణమ్మకు. నిర్గాంతపోయిందామె. స్వయంగా ఆఫీసుకు వెళ్ళనందుకు బాధపడింది మనస్సులో. ఈ సామాన్లు దినభత్యం పెడతాయా. రామం మంచివాడే. కాని ఆఫీసు పని. రెండేళ్ళబట్టి కాని ఆఫీసు పనిని రామం మాత్రం ఎలా చేస్తాడు. అభిమానం చూపించాడు గాని, తాను మాత్రం ఏం చేయగలడు. ఇంతకీ తమ కెన్ని కష్టాలు పడాల్సి ఉందో. ఇలా ఉన్నాయి ఆమె ఆలోచనలు.

మూడు రోజుల తర్వాత పోస్టుమాన్ వీరయ్య మణియార్డరుకు బదులు కవరొకటి ఇచ్చి సంతకం తీసుకున్నాడు మాష్టారిది.

నిరుత్సాహంతో దీనంగా వీరయ్యను చూస్తూ కవరు విప్పారు మాష్టారుగారు. వీరయ్యను చూచి మణియార్డరు వచ్చిందేమోనని ప్రక్కకు చేరింది అన్నపూర్ణమ్మగారు.

ఉత్తరంతోపాటు బాంకు డ్రాఫ్టు, నిర్ఘాంతపోయారాయన. ఉత్తరం విప్పి బైటకు చదివారు.

"దైవ సమానులైన మాష్టారుగారికి,

రామం నమస్కారములతో వ్రాయు లేఖ— మరొకసారి నన్ను మన్నించగలరా, మాష్టారూ! మీ ఫైలు నా దగ్గరకే వచ్చింది. ఏవో కారణాలన్నీ పెట్టి త్రిప్పిన అధముడను నేనే. నా జీవితంలో మళ్ళీ ఇలాంటి తప్పు చేయను. మరో పాఠం మీ నుంచి నేర్చుకున్నాను. ఒక నాడు మీ అన్నంలో అధరువు తిని ఉత్త అన్నం తినేటట్లు చేశాను. ఇప్పుడు మీ మొత్తం తిండిని (మీరు, అమ్మగారు, చెల్లాయి తినే తిండిని) ఆపి వేశాను. ఈ ద్రోహికి ప్రాయశ్చిత్తం లేదు, మాష్టారూ!

నన్ను మన్నించి ఈ డ్రాఫ్టు మార్చుకొని కాలక్షేపం చెయ్యండి. నెల రోజులలోగా మీ పెన్షను, పి. యఫ్., గ్రాట్యుటీ వచ్చేటట్లు ప్రయత్నిస్తా.

అమ్మగారికి నమస్కారములు. చెల్లెలకు నా ఆశీస్సులు. మరొకసారి నన్ను మన్నిస్తారు కదూ, మాష్టారూ!"

చేతిలో ఉన్న ఉత్తరం కన్నీళ్ళతో తడిసిపోయింది. అన్నపూర్ణమ్మగారి కళ్ళు ధారాపాతాలైనాయి.

"వెర్రివాడు—నాకు కోపమేమిటి. వాడు నా శిష్యుడు" అని గొణుక్కున్నాడు మాష్టారు. ★